
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
3
సోమవారం 1 ఏప్రిల్ 2024



వైసీపీ మార్కు దుష్ప్రచారం

"టీడీపీ నాయకులు ఎలక్షన్ కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మన ద్వారా ఇంటింటికీ జరగబోయే పెన్షన్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం నిలిపివేయడం జరిగింది. ఎలక్షన్ జరిగే ఈ రెండు నెలలు సచివాలయం వెళ్లి పింఛన్లు తీసుకోవాలి. చంద్రబాబునాయుడు ఫిర్యాదుతోనే పింఛన్లు ఆగిపోయాయి. ఈ విషయాన్ని వలంటీర్లందరూ పింఛనుదారులందరికీ చెప్పి వారిలో మనసులో విషం నింపి మళ్లీ జగన్‌కు ఓటు వేసే విధంగా చేయాలంటూ పెన్షన్‌దారులకు చెప్పాలి" అంటూ జిల్లాలో కొన్ని వలంటీర్ల వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పుడు వలంటీర్లు ద్వారా పింఛన్లను నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడం, ఆ నెపాన్ని టీడీపీపైకి నెట్టడం చర్చనీయాంశంగా మారింది.

- వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని నిలిపివేసిన ఎన్నికల కమిషన్
- టీడీపీ ఆపిందంటూ వలంటీర్ల ప్రచారం
- జనం సొమ్ముతో వలంటీర్లకు జీతాలు
- ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలంటూ ఈసీ ఆదేశాలు
- అయినా కొందరు బరి తెగించి వైసీపీకి ప్రచారం
- గీత దాటడంపై ఎన్నికల సంఘం సీరియస్
- ఎన్నికలు అయ్యేంత వరకు దూరం పెట్టిన ఈసీ
- వైసీపీ స్క్రిప్ట్ మేరకు విషం కక్కుతున్న వలంటీర్లు
- టీడీపీనే పింఛన్లు పంపిణీ చేయకుండా ఆపారంటూ ప్రచారం



వాట్సప్‌లో వలంటీర్లకు వచ్చిన సందేశం



(కడప - ఆంధ్రజ్యోతి): వైసీపీ. ఈ పార్టీ పుట్టుక ఎమోషనల్, భావోద్వేగాలు, సింపతీ మీద పుట్టింది, ఎలాంటి ఇష్యూ అయినా క్యాష్ చేసుకోవడంలో వైసీపీకి మించిన పార్టీ లేదంటారు. ఏదైనా పార్టీ ఫలానా అభివృద్ధి చేశాం, మాకు ఓట్లు వేయండని అడగడం సహజం. జగన్ పార్టీ మాత్రం రాజశేఖర్‌రెడ్డి మరణాన్ని అడ్డుపెట్టుకుని పార్టీ ఆవిర్భవించింది. అందుకు తగ్గట్లుగానే గ్లోబల్ ప్రచారం చేస్తున్నారు. అంతిమంగా జగన్ సీఎం అయ్యారు. అయితే తనకు అందివచ్చిన సువర్ణ అవకాశాన్ని జనం కోసం ఉపయోగించుకోకుండా కేవలం రాజకీయ ప్రత్యర్థుల కోసమే ఉపయోగించుకున్నారంటారు. సీన్ కట్ చేసి ఐదేళ్లకే జనానికి జగన్ అండ్ కోపై విరక్తి కలిగింది. గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చారు. రకరకాల మాయ మాటలుచెప్పి అధికారంలోకి వచ్చారు. అది ఇప్పుడు ఈఎన్నికల్లో వచ్చేందుకు జగన్ వద్ద హామీల సరుకు అయిపోయినట్లుంది. అందుకేనేమో టీడీపీపై దుష్ప్రచారానికి తెర తీశారు. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయవద్దంటూ ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో అధికారులు గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. అయితే ఈసీ ఆదేశాలను చంద్రబాబుకు ముడిపెడుతూ జగన్ శిబిరం విష ప్రచారానికి తెర లేపింది. వలంటీర్లు అవ్వతాతలకు పింఛన్లు ఇవ్వనీయకుండా చంద్రబాబు అడ్డుకున్నారంటూ ప్రచారం లేపారు. ఈ మేరకు వలంటీర్ల గ్రూపులో మెసేజ్‌లు పెట్టారు.

సంక్షేమానికి టీడీపీ చిరునామా..

దివంగత ఎన్టీఆర్ టీడీపీ స్థాపించిన తరువాత సంక్షేమం మొదలైంది. కిలో రూపాయి బియ్యం, పింఛన్లు, రైతులకు వ్యవసాయానికి హార్స్‌పవర్ రూ.50లకే పవర్ ఇలా ఒకటేంటి అసలు సంక్షేమానికే టీడీపీ పునాది వేసింది. ఇక రాష్ట్ర విభజన తరువాత నవ్యాంధ్రకు తొలి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబునాయుడు లోటు బడ్జెట్ ఉన్నా సరే రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2వేలకు పెంచారు. ఇక 2019 ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే రూ.3వేలు ఇస్తామని చెప్పారు. అయితే జగన్ సీఎం అయిన తరువాత పింఛన్‌ను ఏటా రూ.250 పెంచుతూ పెన్షన్‌దారులకు తీవ్ర నష్టం చేశారు.

అబద్దాల్లో నెంబర్‌వన్ వైసీపీ

వైసీపీ అధినేత జగన్ నుంచి ఆ పార్టీ నేతల వరకు కన్నార్పకుండా అబద్దా లు చెబుతారని విమర్శలు ఉన్నాయి. చేయలేనిది కూడా మేమే చేసినట్లు చెప్పుకొస్తారంటారు. రూ.200 పింఛన్‌ను రూ.2వేలకు చంద్రబాబు పెంచారు. అయితే తామే రూ.2వేలు పెంచినట్లు జగన్ శిబిరం సొంత డబ్బా కొట్టుకుంటుంది అధికారంలోకి వస్తే రూ3వేలు ఇస్తామని హామీ ఇచ్చి సీఎం అయిన తరువాత మాట మార్చి ప్రతి యేటా రూ.250 పెంచుకుంటూ.. పోతామని చెప్పి మోసం చేశారు.

వైసీపీ భజనలో వలంటీర్లు

జగన్ సీఎం అయిన తరువాత వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేశారు. అయితే వీళ్లలో 99 శాతం అంతా వైసీపీ కార్యకర్తలే. ప్రతినెలా వీరికి రూ.5వేలు వేతనం ఇస్తున్నారు. అదీ ప్రభుత్వ సొమ్ముతో. అంటే వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలి. అయితే కొందరు వలంటీర్లు 99 శాతం మంది బరితెగించారు. జగన్ భజన చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. గత ప్రభుత్వాలు పెన్షన్లు కానీ ఫీజురీయంబర్స్‌మెంటు కానీ, రుణమాఫీ, రైతు భరోసా ఆరోగ్యశ్రీ పథకాలు ఇవనట్లు జగనే ఇస్తున్నట్లు వారికున్న వాట్సప్ గ్రూపుల్లో భజన చేస్తున్నారు. జనం సొమ్ముతో జీతాలు తీసకుంటూ జగన్ భజన చేయడాన్ని ఎన్నికల సంఘం తప్పుబట్టింది. ఎన్నికల షెడ్యూలు ఈ నెల 16న వచ్చింది. వలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకూడదని స్పష్టంగా ఆదేశాలు ఇచ్చింది. అయితే జిల్లాలో కొందరు వలంటీర్లు ఎన్నికల నిబంధనలు లెక్క చేయకుండా వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయం పత్రికల్లో కథనాలు రావడంతో పలువురిపై వేటు వేసింది. వద్దన్నా వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై ఈసీ సీరియస్ అయి వారిని పింఛన్ల పంపిణీ నుంచి తొలగించింది. అదే టీడీపీ చేసినట్లుగా.. వలంటీర్లు వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం చేసుకుంటూ ఇంటింటికీ వెళ్లి చెబుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో 50 కుటుంబాలకు ఒకరు, పట్టణ ప్రాంతాల్లో వంద కుటుంబాలకు ఒకరిగా వలంటీర్లను జగన్ ప్రభుత్వం నియమించింది. అందులో భాగంగా జిల్లాలో బద్వేలు నియోజకవర్గంలో 1430 మంది, జమ్మలమడుగులో 1620, కమలాపురం 1170, మైదుకూరు 1415, ప్రొద్దుటూరు 1540, పులివెందుల 1460, కడపలో 1680 మంది వలంటీర్లు ఉన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడంతో కొందరిపై ఈసీ వేటు వేసింది. కేవలం ప్రభుత్వ పథకాలనే తీసుకెళ్లాల్సిన వలంటీర్లు వైసీపీకి కార్యకర్తల్లా వ్యవహరిచడాన్ని ఈసీ సీరియస్ గా తీసుకుంది.

టీడీపీపై దుష్ప్రచారం

గ్రామీణప్రాంతాల్లో 50 ఇళ్లకు, కార్పోరేషన్ మున్సిపాలిటీల్లో వంద ఇళ్లకు వలంటీర్లు నియమించారు. ఆ వలంటీరు వారి పరిధిలో ఉన్న కుటుంబాలతో వాట్సప్ గ్రూపు క్రియేట్ చేశారు. ప్రభుత్వ పథకాలు ఇతరత్రా వాటిపై గ్రూపు చేశారు. అయితే ఇప్పుడు వలంటీర్లతో పింఛన్ల పంపిణీ నిలిపివేతను చంద్రబాబునాయుడు కుట్రతో చేశారని టీడీపీపై విషం చిమ్మేలా ప్రచారం చేయాలంటూ వలంటీర్ల వాట్సప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నా యి. మళ్లీ సీఎం జగన్ అయితే మీకు పింఛన్లు నేరుగా ఇంటికి వస్తాయని పింఛనుదారులకు చెప్పాలంటూ టీడీపీపై బురదచల్లేందుకు సిద్ధం చేసింది. ఈ మేరకు వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు.

సచివాలయ సిబ్బందితో పంపిణీ

పింఛన్ల పంపిణీని వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయనున్నారు. జిల్లాలో నేటి నుంచి లబ్ధిదారులకు నేరుగా సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారు. అయితే దీనిపై వైసీపీ విషం చిమ్ముతోంది. చంద్రబాబునాయుడు కారణంగానే పింఛన్ల పంపిణీ ఆగిపోయాయంటూ తెర లేపింది. లింగాలలో ఎంపీ అవినాష్‌రెడ్డి అవ్వ తాత ఉసురు చంద్రబాబుకు తగులుతుందంటూ శాపనార్థాలు పెట్టారు. ఎన్నికల ఆదేశాలను కూడా టీడీపీకి ముడిపెట్టి లబ్ధి పొందేలా చూడడం వైసీపీకి చెల్లుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీ విష ప్రచారాన్ని ఎవరూ నమ్మరు..

- ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

కొందరు వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారు. అందుకే ఎన్నికల సంఘం వీరిని పక్కనెట్టింది. సచివాలయ సిబ్బంది పంపిణీ చేయాలని అధికారులు ఆదేశించారు. అయితే పింఛన్ల పంపిణీకి జగన్ ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. అందరికీ ఇవ్వాలంటే టైం పడుతుంది. ఇప్పుడు వలంటీర్లు లేరు. వలంటీర్లు వద్దని ఈసీ చెప్పింది. సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేస్తే కాస్త టైం పడుతుంది. ఆ నెపాన్ని టీడీపీపై నెట్టేందుకు ప్రయత్నం చేస్తుంది. వైసీపీ బతుకే దుష్ప్రచారం. దాన్ని ఎవరూ పట్టించుకోరు.

సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం

- ఎన్నికల సంఘానికి పుట్టా ఫిర్యాదు

మైదుకూరు, మార్చి 31: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వలంటీర్లతో పింఛన్లు లేదా ప్రభుత్వ పథకాలు పంపిణీ చేయించవద్దని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ పాపం టీడీపీ వాళ్లదేనంటూ వైసీపీ నాయకులు వలంటీర్లతో సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేయిస్తున్నారు. "ఎన్నికలు జరిగే ఈ రెండు నెలలు సచివాలయాలకు వెళ్లి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ జగనన్న ప్రభుత్వంలో ఘనంగా నిర్వహిస్తారు. అందరూ గమనించగలరు." అంటూ మెసేజ్‌ను మైదుకూరులో ఆదివారం వైసీపీ నాయకులు సామాజిక మాధ్యమాలలో ప్రసారం చేయడంతో హల్‌చల్ అయ్యింది. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని ఇలా టీడీపీ వాళ్లపైకి నెట్టి నిరాధార ఆరోపణలు చేయడం సబబు కాదని, అసత్య ప్రచారాలకు పాల్పడ్డ వారిపై తగిన చర్యలు తీసుకో వాలంటూ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- జిల్లాకు 192080 జవాబు పత్రాల కేటాయింపు
- విధుల్లో 902 మంది సిబ్బంది

కడప (ఎడ్యుకేషన్), మార్చి 31: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకానికి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో నిర్వహించేందుకు అంతా సిద్ధం చేశారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సిబ్బంది విధుల్లో ఉంటారు. జిల్లాకు 192080 జవాబు పత్రాలు కేటాయించారు. ఇందులో తెలుగు 29392, హిందీ 22099, ఇంగ్లీషు 16610, గణితం 32936, ఫిజికల్ సైన్స్ 29550, బయాలజికల్ సైన్స్ 32403, సోషల్ స్టడీస్ 29090 జవాబు పత్రాలు కేటాయించారు. వీటిని మూ ల్యాంకనం చేసేందుకు వంద మంది చీఫ్ ఎగ్జామినర్లు, 602 మంది సహాయక ఎగ్జామినర్లు, 200 మంది స్పెషల్ అసిస్టెంట్లతో కలిపి మొత్తం 902 మంది సిబ్బందిని నియమించారు. ప్రతి గ్రూపులో ఒక చీఫ్ ఎగ్జామినర్, ఆరుగురు సహాయక ఎగ్జామినర్లు, ఇద్దరు స్పెషల్ అసి స్టెంట్లు ఉంటారు. ప్రతి సహాయక ఎగ్జామినరు రోజుకు 40పేపర్లు మూల్యాంకనం చేయాల్సి ఉంది. మూల్యాంక నం చేస్తున్న తరుణంలో సెల్‌ఫోన్లు వినియోగించకూ డదు. మూల్యాంకనం నిమిత్తం ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పిస్తూ విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

ఎవరికీ మినహాయింపు లేదు

మూల్యాంకనం నిర్వహణకు నియామకమైన సిబ్బంది ఖచ్చితంగా హాజరు కావాలని, ఇందులో ఎవరికీ మినహా యింపు లేదని పదో తరగతి పరీక్షల జిల్లా పర్యవేక్షణ అధికారి ఎంపీ క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో జరిగే స్పాట్ వాల్యుయేషన్‌పై డీఈవో, ఏసీఈతో సమీక్ష నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి జిల్లాలో పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ జరు గుతుందని, దీనికి అవసరమయ్యే ఏర్పాట్లు చేయాలని సూచించారు. విధి నిర్వహ ణలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించకుండా విధులు నిర్వహించేలా చర్యలు చేప ట్టాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య మూ ల్యాంకనం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమం లో డీఈవో అనురాధ, ఏసీఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

- సీపీవోకు ఏపీటీఎఫ్ వినతి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 31: సార్వత్రిక ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులైన ఉపాధ్యాయులు, చంటిబిడ్డల తల్లులను, దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహా యింపు నివ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ముఖ్య ప్రణాళిక అధికారికి ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా 60 ఏళ్ల దాటిన ఉపాధ్యాయులను కూడా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. రిసెప్షన్ సెంటర్లు, పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర నాయకులు గుంగలయ్య, జిల్లా నాయకులు నరసింహారెడ్డి, రామ సుధాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నరసింహులు, మస్తాన్, బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై ఫిర్యాదులెన్నో..

- శివప్రసాద్‌పై తీవ్ర అవినీతి ఆరోపణలు
- ప్రభుత్వ భూముల పరాధీనం
- ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ తనిఖీలు

కడప/తిరుపతి/రేణిగుంట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కడప తహశీల్దారు శివప్రసాద్ భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్టు ఏసీబీ అధికారులు గుర్తించి.. శనివారం కడపలోని ఆయన నివాసం, కార్యాలయంతో పాటు గతం లో ఆయన పనిచేసిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు జరిపారు. భారీగా స్థిరాస్తులు గుర్తించి.. పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసు కున్నారు. ఈ సోదాలు మరో వారం రోజుల పాటు జరగనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శివప్రసాద్ అవినీతి, అక్రమాలు, ప్రభుత్వ భూముల పరాధీనంపై ఒక్కసారి పరిశీలిస్తే...

తిరుపతి, శ్రీకాళహస్తి పరిసరాల్లో అత్యంత విలువైన ప్రభుత్వ భూములు పరాధీనం చేయడం.. తీవ్ర అవినీతి ఆరోపణల నేపథ్యంలో రేణిగుంట పూర్వ (ప్రస్తుత కడప) తహసీల్దారు శివప్రసాద్‌పై ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్ దృష్టి సారించింది. ఇన్నాళ్లు ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో ఇతడికి ఉన్న దోస్తీ కారణంగా బుట్టదాఖలా అవుతున్నాయని సమాచారం. దీంతో బాధితులు నేరుగా ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడం వల్లే శనివారం ఆ అధికారితో పాటు బంధువులు, బినామీల ఇళ్లల్లో ఏకకాలంలో తొమ్మిది చోట్ల ఏసీబీ సీఐయూ బృందాలు తనిఖీలు చేపట్టాయి.

తండ్రి మరణంతో కారుణ్య నియామకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా చేరిన శివప్రసాద్.. స్వల్ప కాలంలోనే రూ.కోట్లకు పడగలెత్తారని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఆర్ఐగా పదోన్నతిపై తిరుపతి ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఆయన.. ఓ ఆర్డీవో సహకారంతో ప్రొటోకాల్ డీటీగా వ్యవహరించారని తెలిసింది. ఆ సమయంలోనే ఉన్నత స్థాయి వ్యక్తులతో పరిచయాలు పెంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయలో సీనియర్ అసిస్టెంట్‌గా, అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో ప్రొటోకాల్ డీటీగా పనిచేశారు. ఆయా సందర్భాలలో ఉన్నతాధికారులతో పెరిగిన పరిచయాలతో రేణిగుంట డీటీగా బదిలీ అయి.. అక్కడే పాతుకుపోయారు. అక్కడ తహసీల్దారును డమ్మీని చేసి డీటీగా ఉన్న శివప్రసాదే అధికారం చెలాయించారన్న విమర్శలున్నాయి. విమానాశ్రయం అనుకుని ఉన్న పాతిక ఎకరాల ప్రభుత్వ భూమికి వైసీపీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అండతో ఇతరుల పేరిట పట్టాలు జారీ చేశారని.. దానికోసం ఎకరాకు రూ.20 లక్షల నుంచీ రూ.30 లక్షల దాకా వసూలు చేసినట్టు ఆరోపణలున్నాయి. ఆ తర్వాత తహసీల్దారుగా పదోన్నతి రావడంతో రేణిగుంటలోనే కొనసాగారు. ఆ సమయంలో రూ.కోట్ల విలువచేసే ప్రభుత్వ బంజరు, పోరంబోకు, అనాధీనం భూములను అనర్హులకు కట్టబెట్టడం, అధికార పార్టీ ముఖ్య నేత కబ్జాలకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. తిరుపతి రూర ల్, అర్బన్, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో చెరువులు, కాలువలకు కూడా ఎన్‌వోసీలు జారీ కావడం.. ప్రభుత్వ భూముల పరాధీనం, భూముల సెటిల్‌మెంట్లతో అక్రమార్జన వందల కోట్లకు చేరుకుందని సహోద్యోగులే చెబుతున్నారు.



కలెక్టర్‌కు సరెండర్ చేసినా..!

గతంలో ఇతడిపై వచ్చిన ఆరోపణలపై ఓ కలెక్టర్ విచారణ జరిపించి 40 అంశాలను నిర్ధారిస్తూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారని సమాచారం. ఇటీవల సీసీఎల్ఏ కూడా పలు అంశాల్లో ఇతడిని బాధ్యుడిగా గుర్తించి రేణిగుంట నుంచి కలెక్టర్‌కు సరెండర్ చేసిన సంగతి తెలిసిందే. తీవ్రస్థాయి రాజకీయ ఒత్తిళ్లతో ఇతడిని కలెక్టరేట్‌లో కాకుండా ఏర్పేడు మండలానికి బదిలీ చేశారు. అక్రమార్జన.. నేతల అండ చూసుకుని కలెక్టర్లను కూడా ఖాతరు చేసేవారు కాదన్న ప్రచారం ఉంది. ప్రభుత్వానికి ఎన్ని నివేదికలు ఇచ్చినా, చర్యలకు సిఫారసు చేసినా డబ్బు, పలుకుబడితో అధిగమించేవారని చెబుతున్నారు. గతంలోనూ ఏసీబీకి పలు ఫిర్యాదులు వెళ్లినా.. ఓ అధికారితో స్నేహం వల్ల తనిఖీలు, దాడులు జరగకుండా జాగ్రత్త వహించేవారని అంటున్నారు. సంబంధిత ఏసీబీ అధికారితో కలసి బెంగళూరు వంటి నగరాల్లో భారీ పెట్టుబడులు కూడా పెట్టినట్టు ఆరోపణలున్నాయి.

రంగంలోకి ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్

తాజాగా శివప్రసాద్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు రావడంతో ఏసీబీకి కాకుండా ఆ విభాగంలోని సెంట్రల్ ఇన్వెస్టిగేటివ్ యూనిట్‌కు విచారణ బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది. విజయవాడ నుంచే మొత్తం 42 మందితో కూడిన బృందాలు ఏకకాలంలో దాడులు జరిగాయి. కాగా, తనకు స్నేహమున్న ఏసీబీ అధికారి సూచ న మేరకు మొత్తం అక్రమార్జనంతా బినామీల పేరిట పెట్టినట్టు చెబుతున్నారు. ఇప్పటికే గుర్తించిన పలువురు బినామీల బ్యాంకు ఖాతాలు, లాకర్లను తనిఖీ చేయనున్నట్టు సమాచారం. ఇంతకాలం అధికార పార్టీకి చెందిన ముఖ్య నేతలు ఇతడిని వెనకేసుకొచ్చి, అన్నింటికీ అండదండలిచ్చిన క్రమంలో ఈ దాడులు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నాయి. బహుశా, శ్రీకాళహస్తి ప్రాంతానికి చెందిన నేతకు తెలియకుండా విలువైన భూముల విషయంలో ఎవరికైనా సహకరించి భారీగా లబ్ధి పొంది ఉం టారని, అది ఆలస్యంగా తెలియడం వల్లే ఆ నేతే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈ చర్యలకు కారకులై ఉంటారన్న ప్రచారం జరుగుతోంది. గతంలో పలువురు అధికారులను వేధించిన చరిత్ర ఆ నేతకు ఉండటంతో దీన్ని కొట్టిపారేయలేమంటున్నారు. కారణాలేవైనా ఎప్పుడో జరగాల్సిన ఏసీబీ తనిఖీలు, చర్యలు ఆలస్యంగానైనా మొదలు కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగోలు పనులు

ఏ ప్రభుత్వంలోనైనా నిబంధనల ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలి. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక అటువంటి నిబంధనలకు పాతరవేస్తూ అడ్డగోలు పనులకు శ్రీకారం చుట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో.. ప్రతి డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ సొమ్మును ఆదా చేయడానికి రివర్స్ టెండర్ పద్ధతి తీసుకొచ్చామని చెప్పారు. ఆ తరువాత ఏకంగా సింగల్ టెండర్లు, ఎక్సెస్ టెండర్లకు మున్సిపాలిటీలు, పంచాయతీల్లో పనులు చేపట్టారు. ఇప్పుడు సాధారణ ఎన్నికల వేళ .. వైసీపీ నాయకులకు నామినేషన్ల కింద అడ్డగోలుగా పనులు కట్టబెట్టి కోట్ల రూపాయల ప్రజాధనం కొల్లగొట్టేందుకు ఎత్తులు వేశారు. అసలు పంచాయతీలో జనరల్ ఫండ్ నిధులు లేకున్నా నామినేషన్ల కింద వైసీపీ నాయకులకు పనులు కట్టబెట్టడం విశేషం. ఈ పనులను ఆగమేఘాల మీద ఎన్నికల కోడ్ రావడానికి వారం ముందు ప్రజాప్రతినిధి చేత ప్రారంభించారు.

- జనరల్ ఫండ్ లేకున్నా.. రూ.1.70 కోట్ల పనులకు తీర్మానం
- టెండర్లు లేకుండా నామినేషన్ కింద చేపడుతున్న పనులు
- ఒకే ప్రాంతంలో 34 రీచ్‌లుగా పనుల విభజన
- పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా సాగుతున్న వైనం
- నిబంధనలు గాలికి వదిలేసిన అధికారులు
- ఎన్నికలవేళ.. వైసీపీ నయా దందా
- చీఫ్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు



గోపవరం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలోని వీధుల్లో కాలువల నిర్మాణ పనులు సాగుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు, మార్చి 31: ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ జనరల్ ఫండ్‌లో రూ.25 లక్షలు మాత్రమే నిల్వలు ఉన్నాయి. అయితే ఏకంగా రూ.1.70 కోట్ల మేర పనులను నామినేషన్ల కింద అప్పగించారు. దీనికి ఈ ఏడాది జనవరి 17న పంచాయతీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మేరకు గోపవరం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలోని వీధుల్లో ఒకే ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ఒకే ప్రాంతంలో ఒకే పనిని 34 రీచ్‌లుగా విభజించి మొత్తం మురుగు కాలువల నిర్మాణాలను ప్రారంభించారు. ఒక రీచ్ పనికి రూ.5 లక్షలు కేటాయించి మొత్తం 34 రీచ్‌లకు రూ.1.70 కోట్లతో పనులు సాగిస్తున్నారు. ఇవన్నీ వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో అతని ఇద్దరు అనుచరుల పేరుమీద చేపడుతున్నారు. పంచాయతీ జనరల్ ఫండ్‌లో నిధులు లేకున్నా ఏకంగా రూ.1.70 కోట్ల మేర పనులు నామినేషన్ల కింద చేపట్టడం చట్టవిరుద్ధమని, వీటిని ఆమోదించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఎన్నికల కమిషన్‌కు కొందరు ఫిర్యాదు చేశారు.

ఒక వ్యక్తి.. మూడు బాధ్యతలు..!

వేసవి కాలంలో జనరల్ ఫండ్ నిధులు గానీ గ్రాంట్ నిధులుగానీ మొదటి ప్రాధాన్యత గా తాగునీటికి ఆ తరువాత శానిటేషన్ పనులకు వినియోగించాల్సి ఉంటుంది. అలా కాకుండా మురుగుకాల్వల పనులు చేపట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. జనరల్ ఫండ్ నిల్వలు లేకున్నా నామినేషన్ కింద పనులు మంజూరు చేయడం చట్టవిరుద్ధం. పంచాయతీలో ఓ అధికారి పర్సంటేజీలకు కక్కుర్తిపడి తీర్మానం ఆమోదించారు. ఆ అధికారి ఏకకాలంలో పంచాయతీ కార్యదర్శిగా, ఇన్‌చార్జ్ ఈవో పీఆర్డీగా, ఎంపీడీవోగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. అలా మూడు పదవుల్లో ఉన్న ఆ అధికారి పంచాయతీలో చేసే అక్రమాలకు, అడ్డగోలు పనులకు అడ్డు చెప్పేవారు లేకపోవడంతో నిబంధనలు ఉల్లంఘించి తన జేబులు నింపుకున్నారని ప్రచారం సాగుతోంది.

కలెక్టర్ విచారణ జరిపేనా

ఇదే పద్ధతిలో మండలంలోని మరో పంచాయతీలో నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఓ ప్రాంతంలో రూ.50 లక్షల పనులు పెట్టాలని, ఆ మేరకు పంచాయతీ తీర్మానం ఆమోదించాలని ఒత్తిడి తెచ్చారు. అయితే ఆ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ సభ్యుల తీర్మానాన్ని ఆమోదించనని నిర్మొహమాటంగా తేల్చిచెప్పారు. ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీలో నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న నామినేషన్ల పనులపై కలెక్టర్ విజయ రామ రాజు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిబంధనల మేరకే ఆమోదించాం..

గోపవరం పంచాయతీలో నిబంధనల మేరకు నామినేషన్ల పనులను ఆమోదించాం. రూ.1.70 కోట్ల పనులకు పంచాయతీ జనరల్ ఫండ్‌తో పాటు గ్రాంట్ నిధులు ఉన్నాయి. ఆ నిధులతోనే భగత్‌సింగ్ కాలనీలో కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. 34 రీచ్‌లుగా చేపడుతున్న పనుల్లో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదు.

- రామాంజనేయుల రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ప్రొద్దుటూరు



విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

ఓబులవారిపల్లె, మార్చి 31: విద్యుదాఘాతంతో ఓ వృద్ధుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంట్లో ఒంటరిగా ఉండడంతో దుర్వాసన వచ్చేవరకూ ఎవరూ గుర్తించలేదు. మండలంలోని జీవీపురం గ్రామానికి చెందిన కొమ్మూరు జయరాయం రెడ్డి (68) ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం ఆయన నివాసం ఉంటున్న ఇంటి నుంచి దుర్వాస వస్తున్న విషయం గమనించిన చుట్టుపక్కల ఇళ్ళవారు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంటిలోని సీలింగ్ ఫ్యాన్ కారణంగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు వారు నిర్ధారించారు. వైద్యులను పిలిపించి సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం చేయించినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, మార్చి 31 : డ్రైవర్ కొట్టాలలో నివాసం ఉంటున్న బాలవాసు (35) అనే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలవాసు కలమల్ల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. 2023 డిసెంబరులో పులివెందులలోని నగరిగుట్ట వీధిలో తన భార్య జానకిని గొంతు నులిమి హత్య చేశాడు. ఈ కేసులో పులివెందుల పోలీసులు బాలవాసును అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అతనిపై కేసు నమోదు కావడంతో పోలీసు ఉన్నతాధికారులు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. రిమాండులో ఉన్న అతను వారం రోజుల క్రితం బెయిల్‌పై బయటికి వచ్చాడు. డ్రైవర్ కొట్టాలలోని తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్యను చంపాననే బాధతో రోజు అతను మధనపడేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే అతను ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు.

ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలి


వైసీపీ నేతల సమావేశంలో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక ఉద్యోగులు (వృత్తంలో)

వేంపల్లె, మార్చి 31: వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి అధికారులను కోరారు. గతనెల 29వ తేదీన వైసీపీ నాయకులు వేంపల్లెలోని ఆ పార్టీ కార్యాలయంలో టీడీపీపై విమర్శలు చేసేందుకు ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారని, అందులో ట్రిపుల్ ఐటీలో పనిచేసే సెక్యూరిటీ గార్డు వలి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి బ్రహ్మయ్య పాల్గొన్నారని పులివెందుల ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న తాత్కాలిక ఉద్యోగుల ఫొటోలను టీడీపీ నాయకులు విలేకరులకు విడుదల చేశారు. దీనిపై ఎన్నికల నిబంధనల మేరకు ఉద్యోగులు పార్టీలకు పనిచేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

వాల్మీకిపురం, మార్చి 31: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతపర్తి గ్రామ సమీప బాహుదా కాలువలో 41సంవత్సరాల వయసు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆది వారం శవమై కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగేశ్వర్‌రావ్ సం ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతదే హాన్ని ఒడ్డుకు చేర్చగా మృతుడు ఎరుపు రంగు టీషర్ట్, నీలం రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడని, అంతేకాక అతడి చేతి పైన రాములమ్మ, బాలరాజు అనే పేర్లు పచ్చబొట్టు కూడా ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కాగా ఎవరైనా హతమార్చి మృతదేహాన్ని బాహుదా కాలువలో పడేసారా? లేక అతనే ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అన్న అనుమానాలు పోలీసుల దర్యాప్తులో తెలిసే అవకాశం ఉంది.

రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, మార్చి 31:గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో కొలువైన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి.

వేగానికి ఏదీ కళ్లెం!

- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు..
- బైక్ విన్యాసాలతో బెంబేలెత్తిస్తున్న యువత....


350, 500 సీసీ వాహనాలు ప్రేమతో కొనిస్తున్నారు. అదే వాళ్ల పాలిట శాపంగా మారుతోందని గ్రహించలేకపోతున్నారు.

రైల్వేకోడూరు (రూరల్) మార్చి 31: అధునాతన ద్విచక్ర వాహనాలపై యువత జోరు ప్రజల గుండెల్లో రైళ్లను పరిగెట్టిస్తోంది. ద్విచక్ర వాహనాలను వేగంగా నడుపుతూ యువకులు చేస్తున్న విన్యాసాలు పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వింత హారన్లతో ప్రధాన రహదారుల్లోతో పాటు స్కూలు కాలేజీల వద్ద యువత దూకుడు స్థానికులను హడలెత్తిస్తోంది.

డ్రైవింగ్ లైసెన్సులు లేకుండానే..

ఓ రకమైన ఉన్మాదంతో వాహనాలు దూకుడుగా నడుపుతున్న యువకుల్లో చాలా మంది 15 ఏళ్ల వయసువారు కూడా ఉంటున్నారు. వీరిలో పలువురికి డ్రైవింగ్ లైసెన్సులు కూడా లేవు. వీరు 350, 500 సీసీ సామర్థ్యం ఉన్న బైకులను అధికంగా వాడుతున్నారు. ప్రమాదం జరిగినప్పుడు ఎదుటి వారి సంగతి పక్కనబెడితే కనీసం స్వీయ భద్రతా కోణాన్ని కూడా వీరు విస్మరిస్తున్నారు. కొందరు యువకులు మద్యం మత్తులో వాహనాలను నడుపుతుండడం ఆందోళనకు గురిచేస్తోంది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూనే వాహనాలను పరుగులెత్తిస్తుండడంతో రోడ్లపై వెళ్లే సామాన్యులు భయపడుతున్నారు. ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా యువతలో మార్పు కనిపించడం లేదని పలువురు అంటున్నారు.

తస్మాత్ జాగ్రత్త

తల్లిదండ్రుల అతిప్రేమ యువత జోరుకు బ్రేకులు లేకుండా పోయాయి. రైల్వేకోడూరు మండలంలో చాలామంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. పిల్లల కోరికలు తీర్చడానికి మార్కెట్లోకి వచ్చే కొత్త టెక్నాలజీ

మైనర్లకు వాహనాలిస్తే జైలు



మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నాం. విపరీత వేగంతో దూసుకెళ్లే యువతపై కఠిన చర్యలు తీసుకుంటాం. కోడూరు పరిసర ప్రాంతంలో గల్ఫ్‌కు వెళ్లిన వాళ్లు చాలా ఎక్కువ. వీరు పిల్లల మీద ప్రేమతో కొత్త కొత్త బైకులను కొనిస్తున్నారు. వాళ్లకు లైసెన్సు ఉందో లేదో తెలియకుండా వాహనాలు ఇస్తున్నారు. ప్రమాదాలకు కారణం ఒకరకంగా తల్లిదండ్రులే. ముఖ్యంగా సెలవులు రావడంతో పిల్లలు ఎక్కువగా తల్లిదండ్రులకు తెలియకుండా బైక్‌పై షికార్ వెళ్తుంటారు. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలి.

-టి.బాబు, సీఐ, రైల్వేకోడూరు

బెల్టుషాపుల జోరు షురూ!

- దాడులు చేస్తున్నా ఆగని అమ్మకాలు
- డంప్‌ల ఏర్పాటుకు నేతల ప్రయత్నాలు

పోరుమామిళ్ల, మార్చి 31 : ఎన్నికలు సమీపిస్తుండడంతో మండలంలో బెల్టుషాపులు జోరందుకున్నాయి కోడి కూయకముందే వీటిలో మద్యం అమ్మకాలు ప్రారంభమవుతున్నాయి. పోరుమామిళ్ల పట్టణంలో తెల్లవారుజామున 3 గంటలకే బెల్టుషాపులు తెరుచుకుంటున్నాయి. క్వార్టర్‌పై రూ.50 అదనంగా చెల్లించేందుకు మద్యంప్రియులు వెనుకాడకపోవడంతో ఈ వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది.. సరిపోయినంత డబ్బు లేకపోతే ఇద్దరు నలుగురు కలిసి మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. పోరుమామిళ్లలోని వెంకటేశ్వర థియేటరుకు వెళ్లే దారిలో, పెట్రోలు బంకు సమీపంలో, రంపాడు వెళ్లే మార్గంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఈ బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. పోలీసు అధికారులు దాడులు చేసి, హెచ్చరికలు జారీ చేసి, గ్రామసభలు నిర్వహించినా వీరిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. కొన్ని గ్రామాల్లో మద్యం రహస్య ప్రాంతాల్లో నిలువ చేసి, అవసరాన్ని బట్టి విక్రయిస్తున్నారు. ర్యాలీలు, ప్రచారాల సమయంలో బెల్టుషాపుల నిర్వాహకులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఆ సమయంలో డిమాండ్‌ను బట్టి క్వార్టర్‌పై 50 నుంచి 70 రూపాయలు అధికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం. ఇటీవల పోలీసు అధికారులు, సీఐ చిరంజీవి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో దాడులు చేసి, కేసులు కూడా నమోదు చేశాడు. అయినా, క్వార్టర్‌పై 50 అదనంగా ఆదాయం వస్తుండడంతో పలువురు ఇదే ఉపాధిగా మలుచుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ఏపార్టీ నాయకుడికి ఎంత అవసరమో అంత మద్యం డంప్ చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో బెల్టుషాపులను నియంత్రించకుంటే మద్యం ప్రియుల ఆగడాలు ఎక్కువయ్యే అవకాశాలున్నాయి. బెల్టు షాపులకు సంబంధించి 2022లో మండలంలో 16 కేసులు నమోదు కాగా 2023లో ఐదు కేసులు, 2024లో మూడు నెలల వ్యవధిలో 21 కేసులు నమోదయ్యాయి. ఎన్నికలు సమీపించే కొద్దీ పెరుగుతున్న బెల్టు వ్యవహారం శ్రుతిమించే అవకాశం ఉంది. పోలీసు, ఎక్సైజ్ అధికారులు గ్రామాలపై దృష్టిసారించి బెల్టుషాపులను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మల్లకతవ చెక్‌పోస్టు వద్ద సీఐ స్వాధీనం చేసుకున్న మద్యం (ఫైల్)

బెల్టు షాపుల కట్టడికి కృషి

పోరుమామిళ్ల మండలంలో బెల్టుషాపుల నిర్మూలనకు కృషి చేస్తున్నామని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని, గతంలో బెల్టుషాపులు నిర్వహించిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు, గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. బెల్టుషాపుల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

చిత్రలేఖనంతో విద్యార్థులకు మానసిక ఆనందం

చాపాడు, మార్చి 31: చిత్రలేఖనంతో విద్యార్థులు మానసిక ఆనందం పొందవచ్చని యోగివేమన విశ్వవిద్యాలయం చిత్రలేఖన విభాగాధిపతి మృత్యుంజయరావు అన్నారు. ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూలులో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనస్సులోని భావాలను బొమ్మల రూపంలో గీసి వాటి ప్రతిరూపాలు పొందడమేనన్నారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో 7వ తరగతి విద్యార్థి జేష్ఠసాయికి మొదటి బహుమతి రూ.7 వేలు, 9వ తరగతి విద్యార్థి వెంకటకిశోర్‌కు రెండవ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి 7వ తరగతి విద్యార్థి నిత్యశ్రీకి రూ.3 వేలు నగదు గెలుచుకున్నట్లు వారు తెలిపారు. జూనియర్స్ విభాగంలో 5వ తరగతి విద్యార్థి బృందసాయికి మొదటి బహుమతి రూ.5 వేలు, మనీషకు రెండవ బహుమతి రూ.3 వేలు, 6వ తరగతి విద్యార్థి నిత్యశ్రీ మూడవ బహుమతి రూ.1500 గెలుచుకున్నారు. సబ్ జూనియర్స్ విభాగం విద్యార్థులకు కూడా బహుమతులు పంపిణీ చేశారు. ఛైర్మన్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాళ్లు శ్రీనివాసులరెడ్డి, రవీంద్రకుమార్, డైరెక్టర్ లోహిత్‌రెడ్డి కూడా మాట్లాడారు.


బహుమతులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులరెడ్డి


టమోటా పంటకు వినూత్న సంరక్షణ

- నీడ కోసం మెష్ ఏర్పాటు ● రైతన్నల వినూత్న ఆలోచన

పెద్దతిప్పసముద్రం మార్చి 31 : టమోటా రైతులు వినూత్న రీతిలో మొక్కలకు నీడ కల్పించారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో పంటను రక్షించుకోవడం రైతన్నలకు తీవ్ర సమస్యగా మారింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎండలు అధికం కావడంతో టమోటా మొక్కలను ఎండల బారీ నుంచి కాపాడు కోవడానికి ఓ రైతు తన .పొలంలో మొక్కలు నాటగానే వాటిపై కూలింగ్ షీట్‌ను అమర్చారు. ఇందుకోసం అదనంగా ఒక ఎకరాకు రూ. 35 వేలు ఖర్చు చేశారు. నీడతో పాటు చల్లదనం కూడా ఉండడంతో టమోటా మొక్కలు మామూలు కంటే ఏపుగా పెరుగుతున్నాయి. అదనంగా సస్యరక్షణ కోసం ఎక్కువగా పిచ్‌కారీ మం దులు వాడకుండా కృషి నిర్మాణ్ సంస్థ వారు తయారు చేసిన డ్రిప్ వాడడం వలన మొక్కలు మరింత ఏపుగా పెరుగుతు న్నట్లు రైతు ప్రకాశ్‌రెడ్డి తెలిపాడు.

కూలింగ్ షీట్‌తో అదనపు ప్రయోజనం

కూలింగ్ షీట్‌ను 3 అడుగుల ఎత్తులో ఏర్పా టు చేసుకుంటే మొక్కకు నీడతో పాటు మొక్క పెరగడానికి దోహదపడుతుందన్నారు. తరువాత మొక్క 3 అడుగుల ఎత్తు పెరగగానే ఆ కూలింగ్ షీట్‌ను మరింత ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ షీట్ ఏర్పాటు చేయడం వలన మొక్కలకు చీడపీడలబెడద ఉండదన్నారు. అంతే కాకుండా పంట లకు పిచ్‌కారీ మందుల ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి బాగా వచ్చి రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన ప్రకాశ్‌రెడ్డి ఓ ప్రభుత్వ ఉద్యోగి. వ్యవసాయంపై మక్కువతో రంగసముద్రం పంచాయతీ సాలేవాండ్లపల్లె సమీపంలో 5ఎకరాల భూమిని లీజుకు తీసుకుని టమోటా పంటను వినూత్న పద్ధతిలో సాగు చేసి ఆదర్శగా నిలుస్తున్నాడు. తనకు వ్యవ సాయంపై మక్కువతో టమోటా పంట సాగుకు వినూత్న పద్ధతిలో సాగు చేసి దిగుబడిని సాదించేం దుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో వ్యవసాయం చేయాలంటే ఖర్చులు అధికంగా ఉండ డంతో సామాన్య రైతులు భయపడుతున్నారు.


టమోట పంటకు నీడ కోసం మెష్‌ను ఏర్పాటు చేస్తున్న కూలీలు

కూడు పెట్టని కులవృత్తి

- మట్టి కుండలకు కనిపించని ఆదరణ ● కష్టాల్లో కుమ్మరుల కుటుంబాలు

బద్వేలు టౌన్, మార్చి 31 : నల్లమన్నే వారి ఆస్తి. వారి ప్రపంచం. కుమ్మరిసారే జీవితం. మండువేసవిలో చల్లని నీటిని అందించే కుండను తయారు చేసే కుమ్మర్ల బతుకులు మాత్రం చల్లగా లేవు. రోజంతా కష్టపడిన కడుపు నిండా అన్నం తినలేని ఈ పని ఎందుకని అడిగితే ఇది మా కులవృత్తి, ఇదే మా దైవం అని అంటున్నారు. బద్వేలు నియోజకవర్గ వ్యాప్తంగా కుమ్మరులు కొన్ని కుటుంబాలు మట్టి కుండల తయారీతోనే ఉపాధి పొందుతున్నారు.

ఒకప్పుడు మట్టికుండ లేని ఇల్లు ఉండేది కాదు. వేసవి కాలం వచ్చిందంటే గతంలో ప్రతి ఇంట్లో ఒక మట్టికుండ ఉండేది. రైతులు, వ్యవసాయ కూలీలు కుండల్లో నీళ్ల పోసుకుని పొలంలోకి తీసుకెళ్లేవారు. వేసవిలో ఉప్పుబానలకు మంచి డిమాండ్. ప్రస్తుతం ఫ్రిజ్‌లు కూలర్ల రాకతో కుండను నమ్ముకున్న వారికి జీవనోపాధి కరువు అవుతోంది. మట్టికుండల ఆదరణ రోజురోజుకూ తగ్గిపోతుండడంతో దీంతో ఈ వ్యాపారం చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు కుమ్మర్లు చాలా కాలంగా మట్టి కుండల వ్యాపారం చేస్తున్నారు. ఫిబ్రవరి రెండో వారం నుంచి మే నెల ఆఖరు వరకు ఈ వ్యాపారం ఉంటుంది. ఐదేళ్ల క్రితం వేసవికాలంలో దాదాపు నియోజకవర్గ వ్యాప్తంగా వేసవికాలంలో నీటి కుండలు పల్లెపల్లెలో పట్టణాల్లో అమ్మేవారమని, ప్రస్తుతం 500 కుండలు కూడా అమ్ముడుపోవడంలేదని కుమ్మర్లు ఆవేదన వ్యం చేస్తున్నారు. కేవలం వేసవి కాలంలోనే తమకు వ్యాపారం ఉంటుందని వర్షాలు పడితే పూర్తిగా వ్యాపారం కనుమరుగవుతుందని వాపోతున్నారు.

తయారీ అంత సులువేం కాదు

కుండ, దుత్త, కూర పెనాలు, కూజాలు, కుండీలు, బానలు తయారు చేస్తారు. బంకమట్టి, ఎర్రమట్టి తీసుకు వచ్చి నానబెడతారు. కొంత మంది రోడ్డుపై వేసి వాహనాల కింద తొక్కించి మట్టి ముద్దల్లా చేస్తారు. అనంతరం సారెపై వేసి తమకు కావాలసిన రీతిలో మలుచుకుంటారు. వాటిని ఎండబెట్టి బట్టీలో కాలుస్తారు. ఇంత కష్టపడి తయారు చేసిన కుండలను మార్కెట్లోకి తీసుకువెళ్లేసరికి నిరాశే ఎదురవుతోంది. దీంతో ఒకప్పుడు ఎంతో ఆనందంగా జీవించిన కుమ్మర్లు ప్రస్తుతం కష్టాల కడలిలో ఎదురీదుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కుమ్మర్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కుమ్మరబంధు పథకం పెట్టి కుమ్మర్లను ప్రభుత్వం ఆదుకోవాలని కుమ్మర్లు కోరుతున్నారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టికుండలు

కుండల తయారీలోనే సంతృప్తి

ఎంత చదువుకున్నా కులవృత్తి అయిన కుండల తయారీలోనే ఎంతో సంతృప్తి ఉంది. ఇంట్లో వాళ్లకు చేదోడుగా ఇంటి పట్టునే ఉండి కుటుంబంతో పనిచేసుకుంటూ రోజుకు 20కి పైగా కుండలు తయారు చేస్తున్నాం. కానీ మాకు కూలి గిట్టుబాటు కావడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కుమ్మర్లను ఆదుకుని అవకాశాలు కల్పిస్తే మరింత లాభసాటిగా కుండల వ్యాపారం చేసుకుంటాం.

- జి.రమణయ్య

అమ్మకాలు తగ్గాయి

పల్లెల్లో ఫ్రిడ్జ్‌లు వాడకంలోకి రావడంతో మట్టి కుండలు వినియోగించేవారు తగ్గిపోయారు. అయినా శుభ అశుభ కార్యాలకు కొత్త కుండలు వాడడం ఆగలేదు. గతంలో కుండలు అమ్మితే వచ్చే దాంట్లో కుటుంబం సజావుగా సాగుతుండేది. ప్రస్తుత ఆధునిక యుగంలో ఎలక్ట్రిక్ వస్తువులు వాడకంలోకి రావడంతో కుమ్మర్ల వ్యాపారాలు తగ్గుముఖం పట్టాయి.

- గురయ్య

పొట్టకూటి కోసం వచ్చి.. అనంతలోకాలకు

- విద్యుదాఘాతంతో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు.. పొరపాటా లేక నిర్లక్ష్యమా..



మృతిచెందిన సాగర్, చికిత్స పొందుతున్న లక్ష్మణ్

లింగాల, మార్చి 31: విద్యు త్ లైన్ ఏర్పాటు పనుల ని మిత్తం వలస వచ్చిన ఇద్ద రు యువకు విద్యుదాఘా తానికి గురై స్తంభం మీది నుంచి కిందపడగా, ఒకరు మృతి చెందారు. మరో యువకుడు మృత్యువుతో పోరాడు తున్నాడు. ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు తెలంగాణ రాష్ట్రంలోని వి.ఎం.బంజర్ గ్రామానికి చెందిన 11 మంది కూలీలు 15 రోజుల క్రితం లింగాల మండలం లోపట్నూతలకు వచ్చారు. గ్రామ సమీపంలో విద్యుత్ లైన్ ఏర్పాటు పనులు చేస్తున్నారు. వారిలోని లక్ష్మణ్ (25), సాగర్ (19) ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా, విద్యుదాఘాతం తాకడం తో కిందపడ్డారు. వారిని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా సాగర్ (19) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరిం చారు. లక్ష్మణ్ కుడి చేయి కాలి పోయి వేళ్లు వంగిపోగా, ప్రాథమిక చికిత్స చేసిన డాక్టర్లు కడపకు రెఫర్ చేశారు.

పొరపాటా.. నిర్లక్ష్యమా?

ఆ యువకులు పని చేస్తున్న స్తంభంపె నుంచి అంకాళమ్మ ఫీడర్, బాటమస్వామి ఫీడర్ల విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. వీటిలో అంకాళమ్మ ఫీడర్‌కు ఎల్‌సీ ఇచ్చినట్లు తెలిసింది. అయితే, ఎల్‌సీ ఏ లైన్‌కు ఇచ్చారో తెలియని సాగర్, లక్ష్మణ్‌లు బాటమస్వామి లైన్‌కు అనుసంధాన పనులు చేపట్టేందుకు విద్యుత్ స్తంభం ఎక్కారు. సరైన సమాచారం లేని కారణంగా విద్యుత్ షాక్‌కు గురైనట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఒకే స్తంభానికి రెండు లైన్లు ఉన్నప్పుడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టు సంస్థ కార్మికులకు గ్లౌజులు, షూష్ లాంటి రక్షణ పరికరాలు ఇవ్వకుండానే పనులు చేయిస్తున్నట్లు సమాచారం. విద్యుత్‌లైన్ కన్‌ఫ్యూజన్ కారణంగా షాక్‌కు గురైనట్లు విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కాంట్రాక్టు సంస్థ సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో ఇలాంటి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని పలువురు అంటున్నారు.

ఇరువర్గాల ఘర్షణ : కేసు నమోదు

పోరుమామిళ్ల, మార్చి 31 : పొలం గట్టు దాటారని ఓ వర్గం, తమ పొలంలో గొర్రెలు మేపారని మరో వర్గం పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని సిద్దనకిచ్చాయపల్లెకు చెం దిన కొత్తూరి రంగయ్య పొలంలో మూడు నెలల క్రితం లక్ష్మినరసమ్మ భర్త వెంకటరమణ ట్రాక్టరుతో వెళ్లగా అ్‌ప్పట్లో వారు అభ్యంతరం తెలిపారు. మూడు రోజుల క్రితం తమ పొలంలో గొర్రెలు మేశాయంటూ లక్ష్మి నర సమ్మ, వెంకటరమణలు కొత్తూరు రంగయ్యతో గొడవ పడ్డారు. దీంతో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. లక్ష్మి నరసమ్మ వెంకటరమణ, రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తూరిరంగయ్య, సావిత్రి, నారాయణపై, కొత్తూరి రంగయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మి నరసమ్మ, వెంకటరమణ, రమణయ్యలపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా లక్ష్మినరసమ్మ ఆత్మహత్యాయత్నం చేయడం చర్చనీ యాంశమైంది.


చికిత్స పొందుతున్న లక్ష్మినరసమ్మ

మద్యం మత్తులో దాడి. ఒకరికి తీవ్ర గాయాలు

పులివెందుల రూరల్, మార్చి 31: మద్యం మత్తులో ఓ వ్యక్తి దాడి చేయగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ అరుణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి 7:40గంటల ప్రాంతంలో పులివెందుల పట్టణంలోని పార్నపల్లె రోడ్డులోని వైన్ షాప్ సమీపంలో రవి, బబ్లూ అనే వ్యక్తులు మద్యం సేవించారు. వీరిలో బబ్లూ అనే వ్యక్తి తనకు ఇవ్వాల్సిన అప్పు ఎప్పుడుఇస్తావని అడగ్గా ఇపుడు తన వద్ద లేదని రవి సమాధానమివ్వడంతో మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన బబ్లూ బీరు బాటిల్‌తో తలపై కొట్టడంతో రవి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. కాగా రవి యూసీఐఎల్‌లో ఉద్యోగి.


చికిత్స పొందుతున్న రవి

జూదరుల అరెస్టు

షుల్లూరు, మార్చి 31 : మండల పరిధిలోని దిగువపల్లెలో కొన్ని రోజులుగా జూదమాడుతున్నారన్న విషయం తెలియడంతో ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆదివారం ఉదయం దాడులు నిర్వహించారు. 9 మందిని అరెస్టు చేసి రూ.1,01,020 స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.


అరెస్టు అయిన జూదరులు

గంగమ్మకు పూజలు



పూజలు అందుకుంటున్న గంగమ్మ తల్లి

సీకేదిన్నె, మార్చి 31: చింతకొమ్మదిన్నె మండలం కొత్త పేట గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలతో ప్రదక్షణలు నిర్వహించి బోనాలు సమర్పించారు.

అమ్మవారికి భక్తులు నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, నిమ్మకాయ దండలు సమర్పించారు. రెండవ వారం సందర్భంగా అమ్మవారికి లింగారెడ్డిపల్లెకు చెందిన గంజికుంట మల్లేశ్వరి, గంజికుంట బాను ప్రత్యేక అలంకరణకు సహకరించినట్లు ఈఓ తెలిపారు. భక్తులకు క్యూ లైన్‌లో ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహించినట్లు ఈఓ సురేష్ కుమార్‌రెడ్డి, చైర్మన్ విశ్వనాథరెడ్డిలు తెలిపారు. భక్తులు అమ్మవారి సన్నిధిలో బంధుమిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. జాతరలో అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

టీఎన్ఎస్ఎఫ్‌కు చంద్రబాబు ప్రశంస

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 31 : ఓటు నమోదుపై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని కడపజిల్లాలో విజయవంతంగా నిర్వహిస్తున్న విద్యార్థి యువతలో చైతన్యం నింపుతున్న టీఎన్ఎస్ఎఫ్ జిల్లాఅధ్యక్షుడు బొజ్జ తిరుమలేశ్‌ను చంద్రబాబునాయుడు ప్రశంసించారు. శనివారం ప్రజాగళంలో భాగంగా ప్రొద్దుటూరుకు విచ్చేసిన చంద్రబాబును పొలిట్‌బ్యూరోసభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి రాష్ట్రకార్యనిర్వాహకకార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తిరు మలేశును పరిచయం చేశారు. ఈసందర్భంగా తిరమలేశ్ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రంలో వందలాది కంపెనీలు వెనక్కి పోయాయన్నారు. దీని వల్ల ఎంతో మంది నిరుద్యోగులుగా మిగిలారన్నారు.

'జిల్లాలో అభివృద్ధి శూన్యం'

కడప(కలెక్టరేట్), మార్చి 31: జిల్లాలో అభివృద్ధి శూన్యమని ఇండియా కూటమికి చెందిన కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీల నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విలేకరుల సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో పీసీసీ ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షుడు తిరుపాల్‌రెడ్డి మాట్లాడారు.

గడ్డివామి దగ్ధం

కమలాపురం రూరల్, మార్చి 31 : నగర పంచాయతీ పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న గడ్డివామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో దగ్ధమైందని రైతు గంగవరం రామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పశువుల మేత కోసం వరిగడ్డి, మినుము పొట్టు వామిగా వేశామని, ఆదివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టారన్నారు. ఫైర్ స్టేషన్‌కు ఫోను చేయగా కడప నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పిందన్నారు. వరిగడ్డి మినుము పొట్టు పూర్తిగా కాలిపోయిందని దాదాపు రూ.40వేలు ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు.

రంజాన్ రేషన్ పంపిణీ

పులివెందుల, మార్చి 31: సఫియా ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రేషన్ పంపిణీ చేశారు. తొండూరు మండలంలోని మల్లేల గ్రామంలో ఆర్గనైజర్ జిలాని బాష, మసీద్ కమిటీ సభ్యులు అహమద్ అలీ, షఫిఉల్లా, మహబూబ్ బాష పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య మురుగు కనిపించదా?

● కంపుతో ఇబ్బందిపడుతున్న చిన్నమాచుపల్లె ప్రజలు

చెన్నూరు, మార్చి 31: మండలంలోని చిన్నమాచుపల్లెలో మురుగు కాల్వలు సరిగా లేక ఎక్కడ పడితే అక్కడ మురుగునీరు నిలిచి కంపు కొడుతూ ప్రజలను ఇబ్బంది పెడుతోంది. కార్పొరేషన్ పరిధిలోకి ఈ గ్రామం చేరిన తరువాత కాల్వలు శుభ్రం చేయడంపై దృష్టి సారించింది తక్కువే. దీంతో వేసవి కాలం సైతం మురుగునీరు ఇంకిపోక ఇళ్ల మధ్యనే ప్రవహిస్తూ కాస్త గాలివీచినా ఆ మురుగు కాల్వ నుండి దుర్గంధం వస్తోంది. ఇళ్ల ముందే కాల్వలు మురుగుతో నిండి ఉండటం, దుర్వాసన వెదజల్లుతుండటంతో కాల్వ చుట్టుక్కల ఇళ్ల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగు నీటి వల్ల గ్రామంలో ఈగలు, దోమలు వృద్ధిచెంది జనం జ్వరాలబారిన పడుతున్నారు. పైగా మురుగునీటి కాల్వలు ఎక్కడా సక్రమంగా లేవు. రోడ్డు వరకు బాగానే ఉన్నా రోడ్డు పక్కన ఉన్న మురుగుకాల్వలు సరిగా లేక కాంక్రీటుతో ఏర్పాటు చేయకపోవడంతో మట్టితోనే ఉండి అందులో మట్టి, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరగడం, గాలికి కొట్టుకువచ్చిన వ్యర్థాలన్నీ అక్కడ పడడం, ఆ మురుగు నీటిలో ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా చేరి రోగాలు తెచ్చేలా మారాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మురుగు నీరు నిల్వలేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



చిన్నమాచుపల్లెలో ఇళ్లలో మధ్యనే నిలిచిన మురుగునీరు

తాగునీటి కోసం తప్పని తిప్పలు



తాగునీటి కోసం బిందెలతో వెళ్తున్న మహిళలు

● బోరుబావుల వద్దకు వెళ్తున్న మహిళలు

వీరపునాయునిపల్లె, మార్చి 31: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో గ్రామస్తులు గుక్కెడు తాగునీటి కోసం పరుగులు తీస్తున్నారు. ఈ గ్రామంలో తాగునీటి కోసం రెండు బోర్లు ఏర్పాటు చేశారు. అయితే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ బోర్లు పనిచేయకపోవడంతో వెంకటాపురం వ్యవసాయ పొలాలకు వెళ్లి మహిళలు బిందెలతో తాగునీరు తెచ్చుకునే దుస్థితి ఏర్పడుతోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా బోర్లు పనిచేయకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో నీటి సమస్య తలెత్తడంతో నీటి కోసం ఎండను సైతం లెక్కచేయకుండా బిందెలు చేతపట్టుకొని వ్యవసాయ పొలాల వద్దకెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు చొరవతీసుకొని తాగునీటి సమస్య గ్రామంలో తలెత్తకుండా చూడాలని పలువురు మహిళలు కోరుతున్నారు. నీటి సమస్య తీరకపోతే నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

సీకేదిన్నె, మార్చి 31: టీడీపీతోనే సంక్షేమం సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం పెద్ద కాంపల్లె, చిన్నకాంపల్లె, లక్ష్మీనారాయణపురం, మద్దిమడుగు తదితర గ్రామాల్లో బబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం యువనాయకుడు పుత్తా చైతన్యరెడ్డితో కలిసి నిర్వహించారు. మద్దిమడుగు సుగాలిబిడికిలో వార్డు మెంబరుతో పాటు 10 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో ముందుండాలంటే అది కేవలం టీడీపీకే సాధ్యమని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకే సాధ్యమన్నారు. రాక్షస పాలనకు అంతం పలికి అభివృద్ధికి స్వాగతం పలికేందుకు ఎంతో దూరం లేదని వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించి మహిళలకు ప్రత్యేకంగా అందించే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టక్కోలి వెంకటకృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, సి.వి.సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, దర్బార్‌బాష, శివానంద, రెడ్డిబాష, జబివుల్లా, సర్దార్, భద్ర, నాయక్, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పుత్తా నరసింహారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కాంపల్లె ప్రజలు

వైసీపీ నుంచి టీడీపీలోకి 20 కుటుంబాలు చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, మార్చి 31: మున్సిపాలిటీ పరిధిలోని ఇస్లాంపురంకు చెందిన 20 మైనార్టీ కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. షేక్ బాబావలి, మహమ్మద్ రఫీ, మహబూబ్ బాష, ఫాతిమాతో పాటు 20కుటుంబాలు పార్టీలో చేరారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని వారికి బీటెక్ రవి సూచించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వం వలన మైనార్టీలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం అని ఆలయన మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలకు ఆకర్షితమై పార్టీలోకి వచ్చామన్నారు. ఇస్లాంపురంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథరెడ్డి, మైనార్టీ నాయకులు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి

కడప (క్రైం), మార్చి 31 :ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఆదివారం సాయంత్రం కడప నగరంలోని టూటౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ షరీఫ్ ఆధ్వర్యంలో నకాశ్, అగాడి, సాయిపేట, వక్కలపేట, అల్మాస్‌పేటలోని ప్రధాన రహదారులగుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసులు ప్రజల్లో భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా శాంతిభద్రతలను కాపాడడానికి కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో కడప టూటౌన్ సీఐ ఇబ్రహీం, చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి, తాలుకా సీఐ తిమ్మయ్య, ఎస్ఐలు రంగస్వామి, మధుసూధన్‌రెడ్డి, రవి కుమార్, సంజీవరాయుడు, మహ్మద్‌రఫి, ఎంఏ ఖాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మరణాన్ని జయించిన మహనీయుడు యేసు

● ఘనంగా ఈస్టర్ వేడుకలు


కడప (కల్చరల్), మార్చి 31 : మరణాన్ని జయించిన మహనీయుడు యేసు క్రీస్తు అని, సర్వమానవాళిని పాపాల నుంచి విముక్తి చేయడానికి శిలువలో చనిపోయి తిరిగి లేచాడని న్యూనేటివ్ కృపా ప్రార్థనా మందిరం పాస్టర్ మహేష్ అన్నారు. యేసు సమాధి చేయబడ్డ మూడో దినం అయిన ఆదివారం తిరిగి లేచాడని, కావున ఆయన మరణాన్ని జయించిన మహనీయుడుగా ఖ్యాతిగాంచారని కొనియాడారు. ఈస్టర్ పర్వదినం సందర్భంగా కడప నగరం 48వ డివిజన్ కృపాకాలనీలోని న్యూనేటివ్ కృపా ప్రార్థనా మందిరంలో పాస్టర్ మహేష్‌తో పాటు సిస్టర్ శాంతమ్మ. సంఘ పెద్దల ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి హాజరైన విశ్వాసులకు అన్నదానం చేసి మాట్లాడారు. సత్యాన్ని చంపినా తిరిగి బతుకుతుందని యేసుక్రీస్తు పునరుత్థానమన్నారు. యువతీ యువకులు చెడు వ్యసనాలకు దూరమై ఆధ్యాత్మిక చైతన్యవంతులు కావాలని కోరారు. యేసు చూపినమార్గంలో నడిచిన వారికే పరలోక ప్రాప్తి లభిస్తుందన్నారు. అనంతరం చర్చిలో ప్రజల క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వాసులు రవితేజ, సుధాకర్, అగస్టీన్ శాంతిరాజ్, రోజా, లీలావతి, వానలయ్య, నరసయ్య, సరళ, అశోక్, అంజలి తదితరులు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న పాస్టర్ మహేష్

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

వల్లూరు, మార్చి 31 : ఈస్టర్ పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని క్రిష్టియన్ సోదరులు చర్చిల వద్ద గత అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పైడికాల్వ ఆర్సీఎం చర్చిలో ఫాదర్ చిన్నప్ప ఆధ్వర్యంలో ప్రార్థనల చేపట్టారు. ఫాదర్ మాట్లాడుతూ యేసుక్రీస్తు మానవుల కొరకు జన్మించాడని, పాపాలను తొలగించేందుకు ఆయన ప్రాణత్యాగం చేశాడని తెలిపారు.



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న విశ్వాసులు

ఇసుక ట్రాక్టరు పట్టివేత

చెన్నూరు, మార్చి 31 : పుష్పగిరి రోడ్డులోని గోపవరం వద్ద పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును ఆదివారం చెన్నూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పట్టుబడ్డ ట్రాక్టరును తహసీల్దారు కార్యాలయానికి అప్పగిస్తామని వారు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా నేరమని, చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడవద్దన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబుతోనే సాధ్యం

● జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రివర్స్

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), మార్చి 31 : స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబునే సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం రివర్స్ అయిందన్నారు. అనుభవం, బాధ్యత ఉన్న నేతగా ప్రజల కోసం చంద్రబాబు చేసే పోరాటంలో ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. జగన్ అసమర్థ, అవినీతి పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే మన రాష్ట్రం మాత్రం వెనుకబడిందన్నారు. జగనరెడ్డి రివర్స్ పాలనతో ప్రజల జీవితాలు రివర్స్ అయ్యాయన్నారు. ప్రజలను సంక్షేమాభివృద్ధి వైపు తీసుకెళ్లే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారన్నారు. యువత భవితకు బాబు హామీ ఇస్తున్నారని తెలిపారు. యువత చంద్రబాబుతో కలిసి రావాలని వారి భవిష్యత్ ప్రయాణాన్ని టీడీపీ చేపడుతుందన్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమే కాదు.. వారి జీవన ప్రయాణంలోనూ చంద్రన్న తోడుగా నిలుస్తారని, హామీ తప్పక నెరవేరుస్తారని స్పష్టం చేశారు.

పింఛన్లు ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలి

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 31 : ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా యుద్ధప్రాతిపదికన పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో పింఛన్లు పంపిణీ చేయకపోవడానికి నిధులు కొరతనే కానీ ఎన్నికల కమిషన్ కారణం కాదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఇంటి వద్దకే నెలకు రూ.4వేలు పింఛన్ అందిస్తుందన్నారు. 1 తేదీన పెన్షన్లకు ఇవ్వాల్సిన డబ్బును జగన్‌రెడ్డి తన అనుకూల కాంట్రాక్టర్లకు ఊడ్చిపెట్టారని, దీంతో పింఛన్ల సొమ్ము ఇవ్వడానికి ఖజానాలో లేకుండాపోయిందన్నారు.అందుకే జగన్‌రెడ్డి తన దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎన్నికల కమిషన్‌పై, నిమ్మగడ్డపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. వలంటీర్లను ప్రజా సేవా కార్యక్రమాలకు కాకుండా వైసీపీ కార్యకలాపాలకు వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నారన్నారు. వలంటీర్లు ఎన్నికల కోడ్ ఉల్లంఘించే విధంగా వారిపై క్రిమినల్ కేసు నమోదుకు జగన్‌రెడ్డి కారకుడయ్యాడని తెలిపారు. వలంటీర్లను ప్రజాసేవకులుగా కాక జగన్‌రెడ్డి తన సొంత పార్టీ కార్యకర్తలుగా దుర్వినియోగం పరిచినందుకే ఎన్నికల కమిషన్ వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా పెట్టిందన్నారు. పింఛనుదారుల పట్ల వైసీపీకి ఏ మాత్రం శ్రద్ధ ఉన్నా ఖజానాలో ఉన్న డబ్బు కాంట్రాక్టర్లకు దోచి పెట్టేవాడుకాదన్నారు. పింఛన్లకు నిధుల కొరత పెట్టేవాడుకాదని, సచివాలయ సిబ్బంది, గ్రామకార్యదర్శులతో పింఛన్ల పంపిణీ చేయించకపోవడానికి కారణం నిధుల కొరతే అని స్పష్టం చేశారు. వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా ప్రజా సేవచేసే వలంటీర్లను రాబోయే టీడీపీ ప్రభుత్వం కొనసాగిస్తోందన్నారు. పింఛనుదారులకు రాబోయే టీడీపీ ప్రభుత్వం నెలకు రూ.4వేలు పెన్షన్ ఇంటి వద్దనే పంపిణీ చేస్తుందన్నారు.

మానవత్వం పరిమళింపచేయడమే మానవత లక్ష్యం

చెన్నూరు, మార్చి 31 : సమాజంలో ప్రస్తుత పరిస్థితుల్లో మానవత్వం పరిమళింపచేయడమే లక్ష్యమని మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు బి.సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం చెన్నూరు రామాలయంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఎవరైనా చనిపోతే వారి అంత్యక్రియలకు మానవతా సంస్థ తోడ్పాటునందిస్తుందన్నారు. ఉచితంగా వాహన సౌకర్యం, బాడీ ఫ్రీజర్లు ఏర్పాటు చేస్తుంద న్నారు. మండల అధ్యక్షుడు జీఎన్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దాతల ద్వారా సేవలు విస్తరిస్తున్నట్లు తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మృతదేహాలను మార్చురీకి రలించి చివరి మజిలీలో సహకారం అందించిన ఆటోబాబు, మెరిట్ మార్కులు సాధించిన ఓబుల్‌రెడ్డి తల్లిదండ్రులు, శాంతిరథాలు, బాడీఫ్రీజర్లు అందించిన నామారత్నయ్య కుటుంబీకులను సభ్యు లు సన్మానించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు పెడబల్లి జయభారత్ రెడ్డి, చెన్నూరు అధ్యక్షుడు ఆవుల బసిరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆటోబాబును సన్మానిస్తున్న సుబ్బరాయుడు, భాస్కర్‌రెడ్డి

గర్భిణికి రక్తదానం

కడప (మారుతీనగర్), మార్చి 31 : కాన్పు కోసం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న గర్భిణి రమణమ్మకు బి నెగిటివ్ రక్తం అవసరం కావడంతో ఆమెకు అందించినట్లు జేబీవీఎస్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ పేర్కొన్నారు. బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంకులో రీప్లేస్‌మెంటు కోసం రక్తదానం చేసి అవసరమైన బి నెగిటివ్ రక్తాన్ని ఆమెకు అందించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో రక్తదానం చేయడంపై అవగాహన పెరగడం కోసం ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నాగార్జున, కార్తీక్, సల్మాన్, పద్మావతి, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.



బి నెగటివ్ రక్తం అందజేస్తున్న అశోక్

అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

● పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు


కడప (ఎడ్యుకేషన్), మార్చి 31 : జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాలిటెక్నిక్ ఏపీఆర్‌జేసీ కోచింగ్ సెంటర్లపై చర్యలుతీసుకోవాలని పీ ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సు బ్బరాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు, రాయచోటి. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాల, జూనియర్ కాలేజీల్లో కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారని, ఈ సెంటర్ల నిర్వాహకులు నెలరోజుల శిక్షణకు ఒక్కో వి ద్యార్థి నుంచి భారీగా నిధులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకున్నా అనుభవం లేని అధ్యాపకులచే శిక్షణ ఇస్తున్నట్లు ప్రచారం చేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్ర, నాయకులు అయ్యన్న, హరిక్రిష్ణారెడ్డి, నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

కడప(కలెక్టరేట్), మార్చి 31: జి ల్లాలో ఉద్యోగులందరికీ అర్హత, సీనియార్టీ ప్రాతిపదికన ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు లెక్కల కొండారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎన్జీఓ హౌస్ బి ల్డింగ్ సొసైటీ కార్యాలయంలో లెక్కల కొండారెడ్డి అధ్యక్షతన గృహ నిర్మాణసంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశాకి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎన్జీఓ, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్జీఓ నూతన భవన సముదాయం, అర్హులందరికీ ఇళ్ల స్థలాలు అం దేలా కృషి చేస్తామన్నారు. ఎన్జీఓ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, సొసైటీ డైరెక్టర్స్ ప్రసాద్, వెంకటరెడ్డి, రమేష్ కుమార్, రాఘవరెడ్డి, శ్రీనివాసులు, ఎన్జీఓ సంఘ నేతలు, పెన్షనర్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు సంఘటిత శక్తిగా ఎదగాలి

కడప (మారుతీనగర్), మార్చి 31 : సమాజ హితం కోసం ఆర్యవైశ్యులంతా సం ఘటిత శక్తిగా ఎదగాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ గౌరవ చైర్మన్, మాజీ రాజ్యసభ స భ్యుడు టీజీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో జిల్లా అర్బన్ ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నూతన కార్యవర్గసభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.



నూతన కార్యవర్గంతో టీజీ వెంకటేశ్

నూతన కార్యవర్గం: జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా మునగా శ్రీనివాస్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణయ్య, కోశాధికారిగా పరిటాల వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా దేవతి శంకరయ్య, బెస్తవేముల రామమహేశ్, పొలిటికల్ కమిటీ చైర్మన్‌గా మునగా వెంకట సతీష్‌కుమార్, వైస్ చైర్మన్‌గా లక్ష్మణరావు ఎంపికయ్యారు.

టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

వేంపల్లె, మార్చి 31: టీడీపీ బలోపేతానికి కృషి పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి కోరారు. వేంపల్లె టీడీపీ కార్యాలయంలో ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సీనియర్ నాయకులు జయచంద్రారెడ్డి, కత్తలూరు మాజీ సర్పంచు వీరలింగేశ్వరరెడ్డిలను శాలువ, పూలమాలలతో స త్కరించారు. మండల కన్వీనర్ మునిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్వీ రమేష్, మైనార్టీ నాయకులు అల్లాబక్షు, మహబూబ్ షరీఫ్, ఫ యాజ్, బీసీ నాయకులు శ్రీనివాసులు, మస్తాన్, మాజీ వార్డు సభ్యులు వెంకటేశ్ పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీలో చేరిన వారిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ కార్యకర్త గుండెపోటుతో మృతి

ప్రొద్దుటూరు, మార్చి 31 : ప్రొద్దుటూరులో చంద్రబాబు పాల్గొన్న ప్రజాగళం రోడ్‌షోకు శనివారం రామాపురంనుంచి బోనం గురివిరెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన టీడీపీ కార్యకర్త సంపత్ కుమార్ శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఓదార్చారు. ఆ కుటుంబానికి టీడపీ అండగా ఉంటుందని, ఆదుకుంటుందని ఆయన తెలిపారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న పుట్టా

ఖాజీపేట, మార్చి 31: మండల పరిధిలోని సరంఖాన్ పేట లోని మసీదులో ఆదివారం సాయంత్రం మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ ఇఫ్తార్‌విందులో పాల్గొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఫరూక్ ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందురెడ్డి, మేకలబాబు, వీరయ్య, సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, పల్లె గంగాధర్ పాల్గొన్నారు.

పుట్టాను ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్యులు

ఖాజీపేట, మార్చి 31: ఖాజీపేట బస్టాండులో పొట్టినత్యం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముందస్తు విజయోత్సవ కేక్‌ను కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, మేకలబాబు, ఆదినారాయణరెడ్డి, మురళీకృష్ణ, సురేష్‌బాబు, చంద్ర ఓబుళరెడ్డి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సులకు ఘన సన్మానం



ప్రొద్దుటూరు టౌన్, మార్చి 31: ఇటీవల జరిగిన 2024 ఆలిండియా సివిల్ సర్వీసెస్ వెయిట్‌లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి స్టాఫ్‌నర్సులను ఏపీ నాన్‌గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆదివారం ఎన్జీవో హోంలో స్టాఫ్‌నర్సు మానస పవర్‌లిఫ్టింగ్ 52 కేజీల విభాగంలో గోల్డ్‌మెడల్, వెయిట్‌లిఫ్టింగ్ 55 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఆమె, మరో స్టాఫ్‌నర్సు షేక్ సూర్యఫాతిమా పవర్‌లిఫ్టింగ్ విభాగంలో 4వ స్థానంలో నిలిచింది. వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, కార్యదర్శి రామసుబ్బయ్య, సదాశివయ్య, శివరామానుజ, సంధ్యారాణి, నాగరాజు, సంధ్య, అశోక్ పాల్గొన్నారు.

బీసీలకు ఎప్పుడూ అండ టీడీపీనే

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భూపేశ్‌రెడ్డి, వరదరాజులరెడ్డి



బీసీల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భూపేశ్‌రెడ్డి, వరదరాజులరెడ్డి, సురేష్ నాయుడు తదితరులు

ప్రొద్దుటూరు, మార్చి 31 : బీసీలకు టీడీపీ ఎల్లప్పుడూ అండగా వుంటుందని, టీడీపీ ప్రభుత్వంలోనే బీసీలకు అన్నింటా పెద్ద పీట వుంటుందని ఆ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు భూపేశ్‌రెడ్డి, వరదరాజులరెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం పద్మశాలీయ కళ్యాణ మండపంలో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు ఆధ్వర్యంలో బీసీల ఆత్మీయ సమావేశంజరిగింది. ఈసమావేశంలో బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో బీసీలు మెజారిటీగా వున్నా స్థానిక సంస్థల్లో బీసీలకు ప్రాధాన్యతతో పాటు స్వతంత్రంగా వుండేలా చూడాలన్నారు. బీసీలు రాజకీయంగా ఎదగడానికి టీడీపీ అండగా వుండాలని కోరారు. ఇందుకు వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో బీసీలకు స్థానిక సంస్థల్లోనే కాదు రాజకీయంగా ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించి అండగా వుంటానన్నారు. ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ కడప పార్లమెంటు పరిధిలో బీసీలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య , మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహ క కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు, ఈవీ సుధాకర్‌రెడ్డి , నల్లబోతుల నాగరాజు,బోగాల లక్ష్మీనారాయణమ్మ, జనసేన ప్రతినిధి జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టా ఆధ్వర్యంలో పలువురు టీడీపీలోకి చేరిక



మైదుకూరు... పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన రెహమత్‌ఖాన్‌పల్లె వాసులు

ఖాజీపేట, మార్చి 31: వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని, ఆ పార్టీకి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీలోని రెహమత్‌ఖాన్ పల్లెలో ప్రసాద్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, ఆదికేశవరెడ్డి అనుచరవర్గం మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మైదుకూరు జనసేన ఇన్‌ఛార్జి మల్లోత్ర, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, మైదుకూరు ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి, చిన్నబ్రహ్మారెడ్డి, వేణు, వెంకటరమణ, శేఖర్‌రెడ్డి, సురేష్‌బాబు, మండల నాయకులు వీరయ్య, బుజ్జి, హరినాథరెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, పిచ్చినాయుడు, జానకీరాం, రామానాయుడు, రమణ, గోవిందురెడ్డి, బత్తల శివ, ఉపసర్పంచ్ రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన అశ్వత్థరెడ్డి, నారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, నారాయణ రెడ్డి, శివకుమార్ రెడ్డి వారి అనుచరులు పది కుటుంబాలు ఆదివారం మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు టీడీపీ కార్యాలయంలో పార్టీలోకి వారిని ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పుట్టా సుధాకర్‌యాదవ్ ఎమ్మెల్యేగా చేసే ధ్యేయంగా పనిచేస్తామని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, పూజాశివాయాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం పింఛన్లు పంపిణీ చేయాలి

చాపాడు, మార్చి 31: ప్రభుత్వం అన్ని రకాల పింఛన్లను ఏప్రిల్ నెల 1వ తేదీన పంపిణీ చేయాలని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని అందువలనే ఆలస్యంగా పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెబుతోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పార్టీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తున్నారన్నారు. దీంతో ఖజానా ఖాళీ అయిందన్నారు. సీఎం అనుచరులకు బిల్లులు ఇచ్చి పింఛన్‌దారులకు డబ్బులు ఆలస్యంగా పంపిణీ చేయడం సమంజసం కాదన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది గ్రామ కార్యదర్శుల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. వృద్ధులు, వికలాంగులు, చేనేత కార్మికులు, ఇతరులకు ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు చేయాలి

మైదుకూరు, మార్చి 31 : మున్సిపల్ పరిధిలోని నానుబానుపల్లె ఎస్సీ కాలనీలో తాగునీటి బోరు మోటారు కాలిపోయిందని, వెంటనే మరమ్మతులు చేయాలని రైతు సేవా సమతి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన గ్రామాన్ని సందర్శించి 20 రోజుల క్రితం మోటరు కాలిపోయిందని, గ్రామస్తులు అధికారులకు తెలిపినా పట్టించుకోలేదంటూ ఆరోపించారు. అధికారులు తగిన చర్యలు తీసుకోక పోతే ఆందోళన చేస్తామని తెలిపారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొండాపురం, మార్చి 31 : మండలంలోని దొబ్బుడుపల్లె గ్రామం సమీపంలో ఆదివారం పోలీసులు 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారాను కాచడానికి ఉపయోగించే బెల్లం ఊటను తమ సిబ్బంది సహాయంతో ధ్వంసం చేశామని తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కాగా ఇందుకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు. ఫోటో 31కొండా2 కొండాపురం మండలం దొబ్బుడుపల్లె సమీపంలో బెల్లం ఊటను ధ్వంసం చేసిన పోలీసులు

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

పోరుమామిళ్ల, మార్చి 31 : మండలంలోని కాల్వకట్ట గ్రామానికి చెందిన కల్లూరి పెద్దపీరయ్య అనే వ్యక్తి నాటుసారా కాస్తుండగా అతని నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఏఎస్ఐ మూర్తి తెలిపారు. ఆదివారం మండలంలోని ఇందిరానగర్ వెనుక వైపున కాల్వగట్టు గ్రామానికి చెందిన పీరయ్య నాటుసారా కాస్తుండగా 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే 2 డ్రమ్ముల్లో 250 లీటర్ల నాటుసారా కాసేందుకు సిద్ధంగా ఉన్న బెల్లఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో పునరుత్థానం వేడుకలు





రాజుపాలెం, మైదుకూరులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

రాజుపాలెం, మార్చి 31 : ఈస్టరులో భాగంగా ఆదివారం పునరుత్థానం పండుగను క్రైస్తవులు చేసుకున్నారు. ఏసుక్రీస్తు మూడోరోజు పునరుత్థానుడై జీవించాడని క్రైస్తవుల విశ్వాసం. ఉదయాన్నే మహిళలు ప్రత్యేక ఫలహారాలు, కానుకలు తీసుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం రంగులు చల్లుకుంటూ పండుగ చేసుకున్నారు. ఈకార్యక్రమాలన్నీ మండలంలోని ప త్రి గ్రామంలో నిర్వహించారు.

మైదుకూరు..: మున్సిపల్ పరిధిలోని క్రిష్టాపురంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం పునరుత్థాన ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చర్చి సంఘ గురువు టి.అర్నిష్ రాజ్‌బాబు క్రైస్తవులతో ప్రత్యేక ప్రార్థనలు, దైవ సందేశం వినిపించారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: స్థానిక సిద్దవటం రోడ్డులోని సీఎస్ఐ చర్చిలో క్రీస్తు పునరుత్థాన ఆరాధన (ఈస్టర్)ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక డీనరీ ఛైర్మన్ ఎంఎఫ్ఎస్ ఆనందకుమార్ క్రీస్తు పునరుత్థాన సత్యాలను, క్రీస్తు ప్రభువు సజీవుడుగా సమాధిని గెలిచి లేచెనని బైబిల్‌లోని సత్యాల ద్వారా వివరించారు. స్థానిక ప్రెస్బిటర్ రెవరెండ్ స్వరాజ్ జీవన్‌బాబు ఆరాధన క్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పరిపాలన విభాగం సెక్రటరీ ఎడ్వర్డ్, ట్రెజరర్ సునీల్‌కుమార్, యూత్ కౌన్సిల్‌మెంబరు జ్యోతి, ప్రేమ్‌స్వరాజ్ సిరంగి, దేవానందం, సుజాత, సరళ సలోమి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: పట్టణంలోని వివిధ చర్చిలలో ఈస్టర్‌డే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రామేశ్వరంలోని సీఎస్ఐ చర్చిలో ఫాస్టర్ రెవరెండ్ డాక్టర్ జాకబ్‌ఫ్రాంక్ మాట్లాడుతూ క్రీస్తు గొప్పతనాన్ని వివరించారు. మండల పరిధిలోని సోములవారిపల్లెలోని క్రైస్ట్ చర్చిల్లో ఈస్టర్‌డే సందర్భంగా ప్రత్యేక ఆరాధన మహోత్సవం నిర్వహించారు. చర్చి వ్యవస్థాపకుడు డానియేల్‌బాబు ఈస్టర్‌డే ప్రాముఖ్యతను వివరించారు. మధ్యాహ్నం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. మైదుకూరు రోడ్డులోని ఎస్పీజీ-1, గోకుల్‌నగర్‌లోని ఎస్పీజీ-2, దొరసానిపల్లెలోని ఎస్పీజీ-3, వైఎంఆర్‌కాలనీలోని గోల్డెన్‌జూబ్లీ చర్చితోపాటు వివిధ చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వృత్తికి ప్రవృత్తికి న్యాయం చేసిన వ్యక్తి సన్నపురెడ్డి



వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కాశినాయన మార్చి31: ఉపాధ్యాయ వృత్తికి, రచయితగా ప్రవృత్తికి సమన్యాయం చేసిన గొప్ప వ్యక్తి సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి అని ఎంఈవో నిర్మల పేర్కొన్నారు. కోడిగుడ్లపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ పదవీవిరమణ పొందిన సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డికి ఆదివారం ప్రధానోపాధ్యాయుడు నాగరాజు అధ్యక్షతన సన్మాన సభనిర్వహించారు. ఈకార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్వవెంకట్రామిరెడ్డి, బద్వేల్ ఎంఈవో ప్రమీల , హెచ్ఎం సాంబశివారెడ్డి,పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గురుమూర్తి, పలువురు ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

'జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 31: అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన రోగిని అసభ్య పదజాలంతో దూషించిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ జనసంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పసుపులేటి శివక్రిష్ణ పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో బాధితురాలు ఇమాంబీతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుకదిన్నెకు చెందిన ఇమాంబీ శుక్రవారం అనారోగ్యంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాజువాలిటీ డాక్టర్‌వద్దకు వెళ్లగా ఆయన సరిగా స్పందించలేదన్నారు. మెరుగైన వైద్యంకోసం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి ఫోన్ లిఫ్ట్ చేయలేదని తెలిపారు. దీంతో ఇమాంబీ భర్త పెద్దరాజు, తాను డీసీహెచ్‌కు, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులకు ఫోన్ చేయడంతో కోపోద్రిక్తుడైన సూపరింటెండెంట్ తమను తీవ్రంగా దుర్భాషలాడి పేషెంట్‌కు ఇక్కడ వైద్యం చేయను, తీసుకెళ్లకపోతే మీ అంతు చూస్తానని బెదిరించాడన్నారు. సమావేశంలో పెద్దరాజు, విలయం పాల్గొన్నారు.

ఘనంగా దేవర మహోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 31: స్థానిక కోట వీధిలో చిన్నమ్మ, పెద్దమ్మ తల్లి దేవర (ముద్ద) మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి పెద్దమ్మ, చిన్నమ్మ అమ్మవార్లను తయారు చేసి కొలువుదీర్చారు. ప్రతియేడాది ఉగాది ముందు ఆదివారం పెద్దమ్మ, చిన్నమ్మ తల్లి దేవర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మేకలు, పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీలోకి యానాది కాలనీ వాసుల చేరిక



వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

ప్రొద్దుటూరు,మార్చి 31 : వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలపర్వం కొనసాగుతోంది. ఆదివారం స్థానిక గోపవరం పంచాయితీలోని ద్వారాకానగర్‌లో 100 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.యానాది కాలనీ కుళాయప్ప ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేశ్‌నాయుడు, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ వీఎస్ ముక్తియార్, మాజీ కౌన్సిలర్ అమీర్‌బాషా,నల్లబోతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి : భూపేశ్



మాట్లాడుతున్న దేవగుడి భూపేశ్ రెడ్డి

కొండాపురం, మార్చి 31: రాబోయే ఎన్నికల్లో టీడీపీ,బీజేపీ,జనసేన కూటమి గెలుపే ధ్యేయంగా పనిచేయాలని టీడీపీ కడప పార్లమెంట్ అభ్యర్థి దేవగుడి భూపేశ్‌రెడ్డి తెలిపారు.కొండాపురం టీడీపీ కార్యాలయంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు.రాబోయే ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.పోల్ మేనేజ్‌మెంట్ లో అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చించారు. అదే విధంగా మన టీడీపీ యాప్‌లో యాక్టివ్‌గా ఉండి బాగా పని చేసిన వారికి పార్టీ నుంచి వచ్చిన బహుమతులను భూపేశ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంభాపురం రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి, టీడీపీ,బీజేపీ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ పేర నిరుద్యోగులను మోసం చేసిన జగన్ ప్రభుత్వం



మాట్లాడుతున్న బోగా కల్యాణి

ప్రొద్దుటూరు , మార్చి 31 : నాలుగున్నర సంవత్సరం అధికారంలో వున్న జగన్ ప్రభుత్వం ఒక్క డీ ఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా తీరా ఎన్నికల సమయంలో డీఎస్సీ డ్రామా ఆడి నిరుద్యోగులను వంచించి మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగా శివకళ్యాణి విమర్శించారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఇలాంటి మోసగాళ్లకు నిరుద్యోగులు ఓటు అనే ఆయుధంతో గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు, సమావేశంలో టీడీపీ పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కుమారి, పట్టణ ఉపాధ్యక్షుడు శివనాగిరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు చేయరా..?



నంద్యాల రోడ్డులో రిపేరు చేయకుండా వదిలేసి బోరు

మైదుకూరు రూరల్ మార్చి 31 : మైదుకూరు మున్సిపాలిటీలో తాగునీటి సమస్య నానాటికి అధికమౌతున్నా మున్సిపాలిటీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాతూరులోని రామాలయం ఎదురుగా ఉన్న బోరులో మోటారు తీసి తక్కువ పవర్ మోటారు బిగించడంతో నీరు రావడం లేదు. ప్రొద్దుటూరు రోడ్డులోని అన్నా క్యాంటీన్ రూమ్ వద్ద బోరులో అదనపు పైపులు దించాల్సిన అవసరం ఉంది.అంతేకాకుండా నంద్యాల రోడ్డులోని అంగన్‌వాడీ భవనం వద్ద నున్న బోరు,ప్రొద్దుటూరు రోడ్డులోని పశువుల ఆసుపత్రి ఆవరణలోని బోరులు నెలల తరబడి మరమ్మతులు నోచుకోలేదు. వాటిని మరమ్మతులు చేయిస్తే ప్రొద్దుటూరు రోడ్డు,నంద్యాల రోడ్డులలో తాగునీటి సమస్యను చాలా వరకు తీర్చవచ్చునని ప్రజలు చెబుతున్నారు. తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతుంటే , అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఒరిగిందేమీ లేదు'

జమ్మలమడుగు, మార్చి 31: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు ఒరిగిందేమీ లేదని బీజేపీ నాయకుడు రామలింగారెడ్డి విమర్శించారు. జమ్మలమడుగు బీజేపీ కార్యాలయం వద్ద ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. ప్రధానంగా మైలవరం మండలంలో ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు కాలువలు ఎలా ఉన్నాయి. రైతుల సమస్యలను ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఆ ప్రాంత రైతులు పై నాయకుల వద్దకు వెళ్లి పిన్నయ్య, వెంగక్క చెరువుల సమస్యలు, కాలువల గురించి, పంటల సాగుకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు అడిగినా డబ్బులు లేవని చేతులెత్తేసినట్లు ఆయన విమర్శించారు. లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి కాలువల ద్వారా చెరువులకు నీరు విడుదల చేయమని అడిగినా ప్రస్తుతం అయిదు సంవత్సరాలు కావస్తున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. వైసీపీకి సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డికి ప్రజలు ఓట్లు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకాలమ్మ జాతర



పోరుమామిళ్ల, మార్చి 31 : భక్తిశ్రద్ధలతో అంకాలమ్మ, పోలేరమ్మ జాతరను నిర్వహించారు. ఆదివారం మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో రెడ్డినగర్ 4వ లైనులో వెలసిన అంకాలమ్మ దేవాలయంలో జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. రాఘవేంద్ర నగర్‌కు చెందిన భక్తులు, ప్రజలు మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను అంకాలమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకుని వచ్చి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మొక్కులు చెల్లించారు. కొందరు మహిళలు పూనకంతో భక్తిపారవశ్యంతో చిందులు వేశారు.

వరికి తెగులు - ఆందోళనలో అన్నదాత

రెండు నెలల పంటను మిషన్లతో కోత పెడుతున్న రైతులు ● 150 ఎకరాలు వరి పంటకు తెగులు





వరికి వచ్చిన తెగులును చూపుతున్న రైతు, తెగులు పట్టిన వరిని కోత చేస్తున్న మిషన్

జమ్మలమడుగు, మార్చి 31: జమ్మలమడుగు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరి పంట అధికంగా సాగు చేస్తారు. మండలంలోని గొరిగెనూరు, ధర్మాపురం, అంబవరం, పొన్నతోట, గూడెం చెరువు, పెద్దదండ్లూరు, సిరిగేపల్లె, దానవులపాడు తదితర గ్రామాల్లో వరి పంట అధికంగా రైతులు పండిస్తారు. ఈసారి 2024 జనవరి నెల నుంచి కొందరు రైతులు ఎండకారు వరిసాగు చేశారు. కొందరు ముందుగా వరి సాగు చేసి అరకొర పంట చేతి కొచ్చినట్లుగా వాపోతున్నారు. అందులో గొరిగెనూరు గ్రామంలో రెండు నెలల పంట తెగుళ్లబారిన పడింది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల వలన రైతులకు వరి పంటకు సరిపడ నీరు లేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. అయితే రెండు నెలల పంటకు గింజముఖం పట్టే సమయంలో తెగులు సోకిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కన్నెలూరు గ్రామం వద్ద నుంచి గొరిగెనూరుకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపుల రైతులు వరి పంటను సాగు చేసినట్లు తెలిపారు. పంట సాగుకు దాదాపు రూ.30 వేలు ఖర్చు అయిందన్నారు. రెండు నెలల తర్వాత గింజముఖం పట్టే సమయంల తెగులు సోకి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. జైశ్రీరాం వరి సాగును 150 ఎకరాలకుపైగా తెగుళ్ల ఆశించినట్లు రైతులు తెలిపారు. ఈ సమస్యను జమ్మలమడుగు వ్యవసాయాధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. ఈక్రాప్ చేశారని, పంటకు తెగులు సోకిందని అధికారులకు తెలియజేసినా ఏ ఒక్క అధికారి ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు.

రైతులకు దళారుల బెడద..: వరిసాగు చేసిన రైతులకు దళారుల బెడద అధికంగా ఉంది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రైతులు డిసెంబరు నెల నుంచి వరిసాగు చేశారు. అరకొరగా పంట చేతికొచ్చివచ్చింది. కాగా ఫిబ్రవరి నెల నుంచి రైతుల వద్దకు దళారులు కొందరు తక్కువ ధరకు వడ్లు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం గొరిగెనూరు, ధర్మాపురం, తదితర గ్రామాల్లో నేరుగా వ్యాపారులు పొలంలోనే వడ్లను కొనుగోలు చేస్తున్నారు. రూ.1570లతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.